RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 71

శుక్రవారం 12-07-2024

పేజీలు :04 వెల:రూ. 2.00

# శ్రీశైలం టోల్గేట్ చెక్ పాయింట్ వద్ద చిరుతపులి సంచారం

## కుక్కను చంపిన చిరుత పులి

శ్రీశైలం,శ్రీశైలం టోల్గేట్ చెకింగ్ పాయింట్ వద్ద అర్ధరాత్రి చిరుతపులి సంచారం కలకలం రేపింది అటవీప్రాంతంలో నుండి చిరుతపులి బయటకు వచ్చి టోల్గేట్ చెకింగ్ పాయింట్ వద్ద చిరుత పులి కుక్కను చంపి అటవీలోకి తీసుకెళ్లింది.దర్శనార్థం భక్తులు వెళ్లే మార్గంలోని రోడ్డుపై చిరుత పులి కుక్కని చంపి తీసుకెళ్లడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. అదే సమయంలో అటుగా వెళుతున్న కొందరు భక్తులు తమ వాహనాలలో కూర్చొని కారు లైట్లు చిరుతపులి ఉన్న వైపు వేసి తమ సెల్ ఫోన్లలో వీడియో చిత్రీకరించారు వీడియో తీస్తున్న క్రమంలో భక్తుల అరుపులు శబ్దం మిన్న చిరుత పులి గోడ పైనుండి కిందకు దూకి పక్కనే ఉన్న అటవీప్రాంతంలోకి వెళ్లిపోయింది. రాత్రి సమయం కావడంతో భక్తులు ఎవరు అటువైపు వెళ్లకపోవడం పైగా చీకటిగా ఉండటంతో చిరుతపులి బయటకు వచ్చినట్లు భావిస్తున్నారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# టెండర్లు పిలిచి త్వరలోనే పోలవరం ఎడమ కాల్వ పనులు ప్రారంభం



రూ.800 కోట్లతో మొదటి దశ పనులు చేపట్టి 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు

కృష్ణా-గోదావరి-పెన్నా-వంశధార నదులను అనుసంధానం చేస్తే రాష్ట్రంలో కరవు ఉండదు

భగవంతుడు ఇచ్చిన శక్తితో మీ రుణం తీర్చుకుంటా

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాలా తీయించింది

అసమర్థతో మూడు షుగర్ ఫ్యాక్టరీలు మూత...

రైతులకు న్యాయం చేస్తాం

అధికారులు కార్పెట్ కల్చర్ మానుకోవాలి

-ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అనకాపల్లి,ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఉత్తరాంధ్రలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించవచ్చని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సుజల స్రవంతిని పూర్తి చేస్తే ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో 2.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది. సుజల స్రవంతి పనుల్లో టీడీపీ హయాంలో చేసిన పనులు తప్ప గత ప్రభుత్వంలో ఒక్క ముందడుగు పడలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉందని, ఒక్క ఇంచు కూడా పని ముందుకు కదల్లేదన్నారు. ఐదేళ్లలో ఎక్కడైనా తట్ట మట్టి వేశారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి ఉత్తరాంధ్రలో చంద్రబాబు నాయుడు పర్యటించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం దార్లపూడి వద్ద గురువారం పోలవరం ఎడమ కాల్వను పరిశీలించారు. అంతకుముందు కాల్వ పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనకు వచ్చిన సీఎంకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.'ఓట్లు వేసి గెలిపించిన వారి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. రాష్ట్రంలో ఉభయ గోదావరి జిల్లాల తర్వాత ఎక్కువ ఆదరించిన ప్రాంతం ఉత్తరాంధ్ర. కూటమి అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడానికే ఇక్కడికి వచ్చా. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తినంతా ఉపయోగించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటా. టీడీపీ-జనసేన-బీజేపీ కలిసి కూటమిగా వచ్చాయి. అరాచకాలు చేసిన వ్యక్తిని, తప్పులు చేసిన వ్యక్తిని ప్రజాకోర్టులో శిక్షించారు. రాజకీయాల్లో విర్రవీగితే సరిచేసే శక్తి ప్రజలకే ఉంది. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలబడాలని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ఇప్పుడు ప్రజలు గెలిచారు..రాష్ట్రాన్ని నిలబెట్టడానికి మేము కష్టపడతాం. ఇప్పటికే పోలవరం, అమరావతి, విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశాం. పోలవరంను 72 శాతం నేను పూర్తి చేశాను. ఒక దుర్మార్గుడు వచ్చి డయాఫ్రం వాల్ ను గోదావరిలో కలిపేశారు. కాఫర్ డ్యామ్ లు డ్యామేజ్ అయ్యాయి. 2021 జూన్ కు నీళ్లు రావాల్సి ఉండగా నిర్వీర్యం చేశారు. పోలవరం రాష్ట్రానికి వరం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తి చేసి పోలవరం ద్వారా గోదావరి నీళ్లు తీసుకొస్తే ప్రతి ఎకరాకు నీరు అందించొచ్చు.. కరువు అనే సమస్య ఉండదు. గత ప్రభుత్వ నిర్వాకంతో పోలవరం పూర్తవ్వడానికి ఆలస్యం అవుతోంది. అందువల్ల పురుషోత్త పట్నం, పుష్కర్ లిఫ్ట్ ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని ఈ ప్రాంతానికి తీసుకురావొచ్చు. అండర్ పాస్ లకు కూడా టెండర్లు పిలిచి త్వరితగతిన పూర్తి చేస్తాం.' అని సీఎం తెలిపారు.'ఉత్తరాంధ్ర సుజల స్రవంతిలో కుడి కాలువ 214 కి.మీ పూర్తి కావాల్సి ఉంది. మొదటి విడతగా కాలువను 93 కి.మీ పూర్తి చేయడానికి రూ.800 కోట్లు ఖర్చు అవుతుంది. దీంతో లక్ష ఎకరాలకు అనకాపల్లి పరిధిలో నీరందించవచ్చు. ఇప్పుడే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం. యాక్షన్ ప్లాన్ తయారు చేశాక మరింత వేగవంతంగా పనులు పూర్తి చేస్తాం. ఉమ్మడి తూర్పు గోదావరి, విశాఖ జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పోలవరం కుడి కాల్వ ద్వారా సాగునీరు అందించవచ్చు. 23 టీఎంసీల నీళ్లతో అనకాపల్లి జిల్లాలో ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరందించవచ్చు. రూ.800 కోట్లు ఖర్చు చేసి 93వ కి.మీ వరకు 2.20 లక్షల ఎకరాలకు నీరందించేందుకు మొదటి విడతలో పనులు పూర్తి చేస్తాం. ఈ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంశధార నది దాకా వెళ్తుంది. వంశధార-గోదావరి-కృష్ణా-పెన్నా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలో కరువు లేకుండా చేస్తాం." అని సీఎం స్పష్టం చేశారు"ఈ ప్రాంతంలోని షుగర్ ఫ్యాకర్టీ రైతులకు కూడా హామీ ఇస్తున్నా.. గత అసమర్థ ప్రభుత్వం కారణంగా 3 షుగర్ ఫ్యాక్టరీలు పడకేశాయి. ఇక్కడి రైతులకు కూడా న్యాయం జరగాలి.. వారి భాగస్వామ్యంతోనే ఫ్యాక్టరీలు నడవాలి. రైతులకు న్యాయం చేస్తాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరిస్తాం. నేను కష్టపడతాను.. సంపద సృష్టించి ఆదాయం పెంచి పేదలకు పంచుతాం. మీకు వెసులుబాటు ఇవ్వాల్సిన బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై ఉంది. దేశంలో ఎక్కడా ఇవ్వని విజయాన్ని ఏపీ ప్రజలు ఎన్డీయేకు ఇచ్చారు. ఇది చారిత్రక విజయం. 95 వేల మెజారిటీతో అభ్యర్థులను గెలిపించారు. మీ రుణం తీర్చుకోవడం మా బాధ్యత. దొంగ మాటలు చెప్పేవాళ్ల మాటలు నమ్మి బజారులో తిరగనిస్తే బతుకులు ఏమవుతాయో ఆలోచించాలి." అని సీఎం పిలుపునిచ్చారు "విశాఖ స్టీల్ ప్లాంట్ ను ఏ విధంగా కాపాడుకోవాలో ఆలోచిస్తు న్నాం.. కానీ ఒక పనికి మాలిన పార్టీ ఉంది.. ఆ పార్టీ నేతల పొట్ట నిండా అబద్ధాలే. వారికి కల వచ్చిందంటా...అమ్మడానికి నేను ఒప్పుకున్నానంట. తెలుగువారి ఆత్మ గౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు. "విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు" అని పోరాడి ఫ్యాక్టరీని సాధించుకున్నాం. నాడు ప్రైవేట్ పరం చేస్తామని ప్రతిపాదనలు వచ్చినప్పుడు నేను పోరాడి అడ్డుకున్నా. కేంద్రం నుండి ఆర్థిక సాయం కూడా తీసుకొచ్చాం. స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునే బాధ్యత మాదే. అబద్ధాలు చెప్పే వారి మాటలు ఖండిస్తూ వాస్తవాలు చెప్పాలి.

# నలుగురికి ముందస్తు బెయిల్

విజయవాడ, జూలై 11 ఏపీ హైకోర్టులో వైసీపీ నేతలకు ఊరట లభించింది. టీడీపీ కార్యాలయంపై దాడికేసులో వైసీపీ నేతలకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఏపీ హైకోర్టు తీర్పు వెలువరించింది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై 2021 అక్టోబర్ 19న దాడి జరిగింది. ఆ కేసుకు సంబంధించిన విచారణ ఇప్పుడు వేగంగా జరుగుతోంది. నాలుగు బృందాలుగా ఏర్పడిన పోలీసులు నిందితుల వివరాలను సేకరిస్తున్నారు. విధ్వంసానికి పాల్పడిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. ఇప్పటికే ఐదుగురు వైసీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. అయితే గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మొత్తం 56 మంది నిందితులు ఉన్నట్లు గుర్తించామన్నారు.ఈ ఘటనలో ప్రధాన నిందితులుగా దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కార్పొరేటర్లు ఆరవ సత్యం (సత్యనారాయణ), అంబేద్కర్?తో సహా మరి కొందరిని గుర్తించిచామన్నారు.

# తిరుమలలో ఇక భక్తులదే రాజ్యం

దేవుడిని టచ్ చేశారు...ఫలితం అనుభవించారు

ఎర్రదొంగలను వదిలేది లేదన్న బండి

తిరుమల,జూలై11: శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచకులు పోయారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇప్పుడు స్వామివారికి నిత్యం సేవ చేసే రాజ్యం వచ్చిందని చెప్పారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. తన పుట్టినరోజు సందర్భంగా బండి సంజయ్ శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.



ఈ నేపథ్యంలో వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు బండి. తిరుమలలో శ్రీవారి ఆస్తులకు పంగనామాలు పెట్టిన నయవంచకులు దిగిపోయారని అన్నారు. ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను పూర్తిగా కొల్లగొట్టారని మండిపడ్డారు. స్వామివారిని టచ్ చేశారు కాబట్టే ఘోరంగా ఓడిపోయారని అన్నారు. దేవుడి ఆస్తులను దోచుకొని తింటే ఎవ్వరికైనా ఇలాంటి గతే పడుతుందని అన్నారు. జగన్ హయాంలో టీటీడీ రాజకీయ నిరుద్యోగులకు పునరావాస కేంద్రంగా మారిందని బండి ఫైర్ అయ్యారు. ఎర్రచదనం దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. నయవంచ కులు పోయి, స్వామి వారికి నిత్యం సేవ చేసే సేవకులు వచ్చారని అన్నారు. ఏపీలో గత వైకాపా ప్రభుత్వ పాలకులు వీరప్పన్ వారసులని అభివర్ణించారు. ఎర్రచందనం పేరుతో జాతీయ సంపదను దోచుకున్నారు. ఆ డబ్బుతో రాజకీయాలను శాసించే స్థాయికి చేరుకున్నారు. ఎర్రచందనం దొంగలను వదిలిపెట్టేదే లేదని ఈ సందర్భంగా కేంద్రమంత్రి హెచ్చరించారు. గత అరాచక ప్రభుత్వంలో స్వామివారి నిధులను పక్కదారి పట్టించి తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారు. శేషాచలం కొండల్లో ఎర్రచందనం దోపిడీపై నివేదిక కోరతాం. దాని ఆధారంగా జాతీయ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకుంటాం అని వెల్లడించారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై గతంలోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, తిరుపతి భాజపా నాయకులు అనేక పోరాటాలు చేశారు. కొండ మీద అరాచక పాలన ముగిసింది. ఇన్నాళ్లు భక్తులు ఎదుర్కొన్న సమస్యలు తొలగి పరిస్థితులు చక్కబడ్డాయి. స్వామివారి ఆస్తుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటాం. నరేంద్ర మోదీ దేశాన్ని విశ్వగురువుగా చేసేందుకు కృషి చేస్తున్నారు. ఆయన సారథ్యంలో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతోందని బండి సంజయ్ అన్నారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆందోళన వద్దు

ప్రధాని ఆశిస్సులతో వందశాతం వృద్ధి సాధిస్తాం

దేశ ఆర్థికాభివృద్ధిలో స్టీల్‌ప్లాంట్ కీలక భూమిక

కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి

ప్రైవేటీకరణ జరగరాదన్నదే ప్రజల అభిమతమన్న ఎమ్మెల్యే

విశాఖపట్టణం,జూలై11: విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ ఆర్థికాభివృద్ధికి సహాయపడుతోందని కేంద్ర పరిశ్రమలు, ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. విశాఖ పర్యటనకు వచ్చిన ఆయన.. గురువారం స్టీల్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై అనేక మంది ఆధారపడి ఉన్నారన్నారు. దీన్ని రక్షించడం తమ బాధ్యత అని తెలిపారు. ప్లాంట్ మూతపడుతుందనే ఆందోళన వద్దన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగు తుందని కుమారస్వామి తెలిపారు. అంతకుముందు విశాఖ ఉక్కు పరిశ్రమలోని వివిధ విభాగాలను కేంద్రమంత్రి పరిశీలించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షించడం తమ బాధ్యత అని, ప్లాంట్ మూతపడు తుందనే ఆందోళన వద్దని మంత్రి కుమారస్వామి అన్నారు. ఉక్కు ఉత్పత్తి సహా అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల వివరాలను కేంద్ర మంత్రికి అధికారులు వివరించారు. ప్లాంట్ సందర్శన అనంతరం కుమార స్వామి మీడియాతో మాట్లాడారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఉక్కు పరిశ్రమపై అనేక మంది ఆధారపడి ఉన్నారు. ప్రజలు, సిబ్బంది ఎలాంటి ఆందోళనలు చెందొద్దు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో పరిశ్రమలో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని కుమార స్వామి స్పష్టం చేశారు. ఇదిలావుంటే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటైజేషన్ అవ్వకూడదనే భావన అందరికీ ఉందని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని కలిసేందుకు స్టీల్ ఎ÷-లాంట్ అడ్మిన్ బ్లాక్‌కు ఎమ్మెల్యే వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్టీల్ ప్లాంట్ ఉద్యోగాలకు భద్రత కల్పించి ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను తీసుకొచ్చారని గుర్తుచేశారు. విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ బీజేపీ తరఫున ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటైజేషన్ అవ్వకుండా మంచి భవిష్యత్తు స్టీల్ ప్లాంట్‌కి ఉండేటట్టు చూడవలసిందిగా తాము కూడా కోరామని తెలిపారు. ఎలక్షన్ ముందు కూడా కోరడం జరిగిందన్నారు. ఎలక్షన్ తర్వాత బీజేపీ పార్లమెంట్ సభ్యులు... కేంద్ర అధిష్టానానికి చెప్పామన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, కేంద్రమంత్రి కుమారస్వామి ప్లాంట్ విజిట్ చేసి మంచి నిర్ణయం తీసుకుంటారని నమ్మకం ఉందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు అనేక రకాల ఆప్షన్స్ ఉన్నాయన్నారు. ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటే.. మన భవిష్యత్తు బాగుంటుంది, ఉద్యోగస్తులకు ఇబ్బంది ఉండాలనేది అందరి అభిప్రాయం' అని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు.

# ఏపీలో 19 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని 19 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటవీ, పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక సీఎస్‌గా జి. అనంతరాము స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శిగా ఆర్‌పీ సిసోడియాను నియమించింది.సీసీఎల్‌ఏ చీఫ్ కమిషనర్‌గా జి. జయలక్ష్మి , ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కమిషనర్‌గా, జీఏడీ కార్యదర్శిగా సురేశ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీశాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా సౌరబ్ గౌర్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శిగా యువరాజ్, మైనార్టీ, సంక్షేమశాఖ కార్యదర్శిగా హర్షవర్ధన్, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యదర్శిగా పి. భాస్కర్‌ను నియమిస్తూ ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలు అప్పగించింది. హోంశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా కుమార్ విశ్వజిత్ ను నియమించింది.సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కె.కన్నబాబును నియమించింది. పర్యాటకశాఖ కార్యాదర్శిగా వినయ్‌చంద్, యువజన సర్వీసులు, క్రీడలశాఖ కార్యదర్శిగా వివేక్ యాదవ్, మహిళా, శిశుసంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా సూర్యకుమార్‌ను నియమించింది.ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా సి. శ్రీధర్, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శిగా జె.నివాస్‌కు పోస్టింగ్ కల్పించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా విజయరామరాజు, సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్‌గా హిమాంశు శుక్లా, వ్యవసాయశాఖ డైరెక్టర్‌గా ఢిల్లీరావుకు పోస్టింగ్ ఇచ్చారు.

# సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట

కూరగాయల ధరలపై దృష్టి పెడతాం

మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడి

కాకినాడ,జూలై11: సంక్షేమ కార్యక్రమాలకు ఈ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.... ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ధరలు స్థిరీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కృషి అభినందనీయమని కొనియాడారు. సూపర్ ఫైన్ రకం బియ్యం పేదలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి కొద్ది కాలంలోనే పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడుతోందన్నారు. తొందరలోనే కాయగూరల ధరలు కూడా తగ్గించే ప్రయత్నం చేపడతామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. పేదలకు చెందాల్సిన బియ్యాన్ని కొంతమంది దారి మళ్ళిస్తున్నారని రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఘనంగా ఆహ్వానించారన్నారు. ఈ ప్రభుత్వంలో పేదలకు, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. పేద ప్రజల మీద ధరల భారాన్ని తగ్గిస్తామన్నారు. నాణ్యత కలిగిన కందిపప్పును ప్రజలకు అందిస్తున్నామని ఎంపీ చెప్పుకొచ్చారు. గడచిన ఐదు సంవత్సరాలుగా మధ్యతరగతి వాళ్ళు జీవించలేని పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. తమ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇన్నాళ్లు వైసీపీ నేతలు వారి జేబులు , కడుపులు నింపుకున్నారని మండిపడ్డారు. నాణ్యతకు సంబంధించి అధికారులతో పాటు నాయకులు కూడా బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఆర్థికస్థితిని దారిలోకి తేవాల్సిందే

అదే తనముందున్న అతిపెద్ద లక్ష్యం

బాధ్యతలు చేపట్టిని ఆర్థికమంత్రి కేశవ్

అమరావతి,జూలై11÷ూష్ట్రంలోని ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం.. ఎకానమీని పునరుద్ధరిం చడం తన ముందున్న ప్రధాన లక్ష్యమని ఎపి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గడచిన ఐదేళ్లలో వ్యవస్థను దెబ్బతీశారన్నారు. ఆర్థిక మంత్రిగా పయ్యావుల కేశవ్ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే 15వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయలు స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన మొదటి బాధ్యతగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 16 పథకాలను ఆపేసిందని.. వాటిలో 60 శాతం రాష్ట్రం... 40 శాతం కేంద్రం నిధులు పెట్టేవని పేర్కొన్నారు. వీటి మొత్తాన్ని ఆపేశారని పయ్యావుల కేశవ్ వెల్లడించారు. కేంద్రం నిధులు కూడా వాడుకోని పరిస్థితి వైసీపీ హయాంలో ఉందన్నారు. వ్యవస్థలు అన్నీ గాడి తప్పాయన్నారు. ఎవరు జగన్‌కి సలహా ఇచ్చారో కూడా తెలియదని పయ్యావుల కేశవ్ అన్నారు. కామన్ మ్యాన్ నుంచి వచ్చే కన్నా పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీంలు సరిగా వాడితే ఎంతో మేలన్నారు. ఎలక్ట్రసిటీపై డ్యూటీలను దారుణం గా వేశారన్నారు. అక్క చెల్లెమ్మలకు, అవ్వ తాతలకు జగన్ ఇచ్చిన దాని కన్నా దోచింది ఎక్కువని పయ్యావుల కేశవ్ అన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 12-07-2024

## ఆయుధమా... దరిద్రమా....

సరిగ్గా ఉపయోగిస్తే సోషల్ మీడియాను మించిన ఆయుధం లేదు. కానీ తప్పుగా ఉపయోగిస్తే దానంత దరిద్రమూ ఇంకొకటి లేదు. నిజానికి ప్రస్తుతం సోషల్ మీడియా ఎంత దారుణంగా ఉంటుందో రోజూ చూస్తూనే ఉన్నాం. నచ్చని వాళ్లపై ద్వేషాన్ని స్ప్రెడ్ చేయడం, నెగెటివిటీ పెంచడం. లేడీస్‌పై ఇష్టమొచ్చినట్లుగా పోస్టులు చేయడం, సెలబ్రెటీలను బూతులు తిట్టడం. ఇలా సోషల్ మీడియాలో జరిగే అకృత్యాలకి అడ్డు అదుపే లేకుండా పోయింది. కనీసం చిన్న పిల్లలు అనే ఇంగితం కూడా లేకుండా వారిపై కూడా సోషల్ మీడియాలో డబుల్ మీనింగ్ ట్రోల్స్, మీమ్స్ క్రియేట్ చేస్తున్నారు కొంతమంది దరిద్రులు.ఎవరు ఎటు పోతే ఏంటి.. అతనికి వ్యూస్ కావాలి. అతని పర్వర్షన్ హైలైట్ కావాలి. అందుకు ఏమైనా చేస్తారు.. ఎంతకైనా తెగిస్తారు. సభ్య సమాజంతో పని లేదు.. తమ మైండ్‌లో ఉన్న చెత్తనంతా సోషల్‌మీడియాలోకి డంప్ చేస్తారు. పగలబడి నవ్వుకుంటారు. అందుకు తండ్రీకూతుళ్ల పవిత్ర బంధాన్ని కూడా వాడుకుంటారు. సోషల్ మీడియా ఎంత వికృతంగా తయారైందో.. ఇన్‌ఫ్లూయెన్సర్ల ముసుగులో ఎలాంటి నరరూప రాక్షసులు ఉన్నారో మరోసారి తెరపైకి వచ్చింది.ప్రణీత్ హనుమంతు వీడియో చాటింగ్. అందులో అతని తూతుంబర్ బ్యాచ్ చేసిన కామెంట్స్. వీళ్ల వల్గర్ కామెంట్స్ ఎంత దిగజారాయో. వాళ్ల సంభాషణ చూసినవాళ్ల మైండ్ ఎలా మారిపోతుంది. ఇప్పుడు సోషల్ మీడియా మైనర్ల చేతిలోకి కూడా వచ్చేసింది. వాళ్లపై ఎలాంటి ఎఫెక్ట్ చూపిస్తుందో స్పెషల్ గా చెప్పాల్సిన పనిలేదు. ఈ వీడియోలో తండ్రీకూతుళ్ల గురించి అసభ్యంగా మాట్లాడిన ప్రణీత్ హనుమంతు బ్యాచ్.. తమ పిల్లల విషయంలోను అలాగే బిహేవ్ చేస్తారా? ఇలాగే.. వికృతానందం పొందుతారా ? చిన్నపిల్లలపై వీళ్ల పైశాచిక కామెంట్స్ పై సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేగింది. యాక్టర్ సాయి ధరమ్ తేజ్ ట్వీట్ తో మొత్తం ఇండస్ట్రీ దీనిపై డిబేట్ చేసింది. దీంతో సీఎం రేవంత్ దీనిపై సీరియస్ అయ్యారు.. వెంటనే నిందితులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. అమెరికా పారిపోతుండగా ప్రణీత్‌ను బెంగుళూరులో అరెస్ట్ చేశారు హైదరాబాద్ పోలీసులు. త్వరలోనే అతడ్ని హైదరాబాద్ తీసుకువస్తారని సమాచారం. ఇప్పటికే ప్రణీత్‌పై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. చాలా కాలంగా కామెడీ పేరుతో డబుల్ మీనింగ్ డైలాగులు, బూతులతో యూట్యూబ్ సహా సోషల్ మీడియాలో ప్రణీత్ వీడియోలు పోస్ట్ చేస్తున్నాడు. నలుగురు ఐదుగురు ఫ్రెండ్స్‌తో కలిసి ఏదో ఒక టాపిక్ మీద చర్చ పెడుతూ అసభ్యకరమైన కామెంట్లు చేస్తున్నాడు. ఇలానే తాజాగా ఓ తండ్రీకూతుళ్ల వీడియోపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతూ ప్రణీత్ రెచ్చిపోయాడు.ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మొదటిగా హీరో సాయి ధరమ్ తేజ్ దీనిపై ఇండైరెక్ట్‌గా స్పందించారు. సోషల్ మీడియాలో మృగాలు ఎక్కువైపోయాయి.. తల్లిదండ్రులు దయచేసి మీ పిల్లల ఫొటోలు, వీడియోలు ఇందులో పెట్టేటప్పుడు జాగ్రత్తగా ఉండండి అంటూ సాయి తేజ్ ఓ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ తర్వాత టాలీవుడ్ యంగ్ హీరోలు మంచు మనోజ్, విశ్వక్ సేన్, అడివి శేష్, కార్తికేయ, సుధీర్ బాబు సహా పలువురు ప్రణీత్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలను కోరారు. సెలబ్రెటీలు వరుసగా పోస్టులు పెట్టడంతో ప్రభుత్వాలు కూడా వెంటనే స్పందించాయి. సదరు యూట్యూబర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చాయి. ఇచ్చిన మాట ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ప్రణీత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అయితే తాను చేసింది తప్పేనని.. అనుకోకుండా అలా వీడియో చేశానంటూ ప్రణీత్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశాడు. దయచేసి తన తల్లిదండ్రులను ఇందులోకి లాగొద్దంటూ రిక్వెస్ట్ చేశాడు. ఈ మేరకు క్షమాపణలు చెబుతూ కూడా ఓ వీడియోను పోస్ట్ చేశాడు. కానీ నువ్వు చేసింది చిన్న తప్పు కాదు పెద్ద క్రైమ్ అంటూ నెటిజన్లు ప్రణీత్ వెంటపడి మొత్తానికి అరెస్ట్ చేయించే వరకూ సోషల్ మీడియాలో పెద్ద ఉద్యమమే చేశారు.మరి అరెస్ట్ ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుందా..? కానే కాదు.. ఎందుకంటే దొరికింది ఒక్కరే. ఇలాంటి బ్యాచ్ కుప్పలు తెప్పలుగా ఉన్నారు. వీరు చేసే అరాచకాలకు అనేక మంది ఇన్ఫ్లూయెన్స్ అవుతున్నారు. ఈ పరాకాష్టకు తోడు చిన్న పిల్లలపై అఘాయిత్యాలు. చిన్న పిల్లల్ని బయటకు పంపించాలంటే వణికిపోతున్నారు పేరెంట్స్. అయినా చిన్న పిల్లలపై వల్గర్ లాంగ్వేజ్ ఏంటీ బుద్ధి లేకపోతే సరి.చిన్న పిల్లలపైనే కాదు.. సోషల్ మీడియాలో ఏది పెట్టిన ఇప్పుడు వైరలే అవుతోంది. పెరుగుతున్న టెక్నాలజీతో ప్రపంచంలో ఎక్కడేం జరిగినా క్షణాల్లో తెలుస్తోంది. దీనికి తోడు టాపిక్ ఏదైనా.. మన ఓపినియన్‌ను ఎంచక్కా చెప్పుకునే ఫ్రీడమ్ ఉంది. ట్రెండ్‌కు తగ్గట్టు మారడం.. సోషల్ మీడియాను ఉపయోగించుకోవడం పెద్ద తప్పేమీ కాదు. కానీ ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనో.. ఏం అన్నా తమనేం చేయలేరన్న ధీమా వచ్చేస్తుందో అప్పుడు అన్నీ అదుపు తప్పుతాయి. కామెంట్లు కంట్రోల్ తప్పుతాయి. లేటెస్ట్ గా జరిగింది కూడా అదే.ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి? ఎందుకు ఇంతలా దిగజారి మాట్లాడుతున్నారు? వాట్సాప్ , ట్విట్టర్ , ఫేస్బుక్ , యూట్యూబ్ ఇలా ప్లాట్‌ఫామ్ ఏదైనా సరే. అన్నింటినీ నెగిటివ్ కోణంలోనే చూస్తున్నారు. ఏదైనా పోస్టు పెడితే దానికి బాధ్యతాయుతంగా కామెంట్ చేసేవారు ఎంతమంది? అయితే బూతుపురాణం.. లేదంటే క్యారెక్టర్ అసోసియేషన్. అదీ కాకపోతే అంతకుమించిన అలిగేషన్స్ చేయడం. అంతేకాని ఆ పోస్టు దేని గురించి..? అది నిజమేనా? కాదా? అని ఫ్యాక్ట్ చేసుకునేది లేదు. చేతిలో ఫోన్ ఉంది కదా అని.. రెచ్చిపోవడం మాత్రమే జరుగుతోంది.పచ్చి బూతులతో నిండిపోతున్న పోస్టులను చూస్తే అసలు వారు చదువుకున్న వారేనా అన్న డౌట్ రాక మానదు. ఎందుకంటే సోషల్ మీడియా ఉపయోగిస్తున్నారంటేనే కాస్తో కూస్తో చదువుకున్నవారై ఉంటారు. మరి వారికి ఆ చదువు నేర్పిన సంస్కారం ఇదేనా ? ఎదురుగా లేరు కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే నొచ్చుకునే మనసులు ఉంటాయి. మొన్నటికి మొన్న ఓ తల్లి పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించిందని ట్రోల్ చేశారు. ఆ ట్రోల్స్ భరించలేక ఆ తల్లి చనిపోయింది. అంతకు ముందు గీతాంజలి అనే మహిళ. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది ట్రోల్స్ కి బలవుతున్న వారే. అసలు బూతులు తిట్టే హక్కు ఎవరిచ్చారు ? ఇలాంటి బూతు, రోత కామెంట్లు పెట్టే హక్కు ఎవరిచ్చారు ? ఒక్కసారి ఆలోచించండి. బాధ్యతగా మెలగండి. అన్నింటికంటే ముందు మనం మనుషులమని గుర్తించండి. ఎదుటి వారికి కనీస గౌరవం ఇవ్వాలన్న ఇంగిత జ్ఞానాన్ని మరవకండి.

# ప్రవీణ్ ప్రకాష్ స్వచ్ఛంద పదవీ విరమణకు గ్రీన్ సిగ్నల్

విజయవాడ, జూలై 11, ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ చేసుకున్న వాలంటరీ రిటైర్మె?ంట్ దరఖాస్తును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 1994 బ్యాచ్‌కు చె?ందిన ప్రవీణ్ ప్రకాష్ మరో ఏడేళ్ల సర్వీస్ ఉండగానే పదవీ విరమణ చేయనున్నారు.2031 జూన్ 30వ తేదీన రిటైర్ కావాల్సి ఉన్నా ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రవీణ్ ప్రకాష్ విఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన దరఖాస్తును పక్షం రోజుల వ్యవధిలోనే రాష్ట్ర ప్రభుత్వం అమోదించింది. ఈ ఏడాది జూన్ 25వ తేదీన వీఆర్‌ఎస్ కోసం ప్రవీణ్ ప్రకాష్ దరఖాస్తు కోగా దానిని అమోదిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.ఏడాదిన్నర కిందటే వీఆర్‌ఎస్ తీసుకోవాలని భావించిన ప్రవీణ్ ప్రకాష్, సన్నిహితుల సూచన మేరకు అప్పట్లో వీఆర్‌ఎస్ పై వెనక్కు తగ్గారు. అప్పట్లో ముఖ్యమంత్రి కార్యాలయంలో పెత్తనం చెలాయిస్తున్నారని ఐఏఎస్ అధికారుల నుంచి విమర్శలు రావడంతో ఆయనను విద్యాశాఖకు బదిలీ చేశారు. ఆ సమయంలో పదవీ విరమణ చేసి క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించాలని భావించారుఅదే సమయంలో ఐదారు సార్లు కేంద్ర సర్వీసులకు వెళ్లేందుకు విఫలయత్నం చేశారు. ఆయన దరఖాస్తు చేసిన ప్రతిసారి కేంద్రం దానిని తిరస్కరించింది. ఆలిండియా సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా సీనియర్ ఐఏఎస్ అధికారులతో వ్యవహరించారని విమర్శలు ఎదుర్కొన్నారు. ఆయన చర్యలతో ఇబ్బందులకు గురైన అధికారులు డిఓపిటి, కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో ప్రవీణ్ ప్రకాష్‌ను కేంద్ర సర్వీసుల్లోకి తీసుకోడానికి నిరాకరించినట్టు ప్రచారం జరిగింది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ప్రవీణ్ ప్రకాష్ తనకు రాజకీయంగా ఇబ్బందులు తప్పవని భావించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజుల్లోనే ఆయన విఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసకున్నారు. ప్రవీణ్ ప్రకాష్ వీఆర్‌ఎస్ సెప్టెం బరు 30 నుంచి అమల్లోకి వస్తుందని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ప్రవీణ్ ప్రకాష్‌ను విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పించారు. జీఏడీలో రిపోర్టు చేయాలని సూచించింది. మరోవైపు వీఆర్‌ఎస్ దరఖాస్తు చేయడంలో కూడా ప్రవీణ్ ప్రకాష్ గందరగోళం సృష్టించారు. వీఆర్‌ఎస్ కోసం చేసిన దరఖాస్తులో చేతిరాతతో సంతకం చేయకుండా డిజిటల్ సంతకం చేశారు. అది చెల్లదని దరఖాస్తును తిప్పి పంపడంతో మరోసారి దరఖాస్తు సమర్పించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విఆర్‌ఎస్ అస్త్రం ప్రయోగించారని సచివాలయంలో ప్రచారం జరిగింది.ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తాను పని చేయలేనంటూ ఎన్నికల ముందు నుంచి ప్రవీణ్ ప్రకాష్ చెబుతూ వచ్చారు. తనకు మంచి ప్రైవేట్ ఉద్యోగం చూడాలని అప్పట్లో ఓ ఐఏఎస్‌కు వాట్సప్ సందేశం కూడా పంపారని సమాచారం.విద్యాశాఖలో ఉండగా గత ఏడాది బడిఈడు పిల్లలు బడి బయట కని పిస్తే ఉద్యోగానికి రాజీనామా చేస్తానంటూ హడావుడి చేశారు. విద్యాశాఖలో వింత నిర్ణయాలతో ఇబ్బంది పెట్టినట్టు ఉపాధ్యాయులు వాపోయేవారు. సమీక్షలు, శిక్షల పేరుతో ఒత్తిడి పెంచేవారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపించాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉత్తరప్రదేశ్ నుంచి ఎంపీగా పోటీకి ప్రయత్నాలు చేస్తున్నారని, ఉద్యోగానికి రాజీ నామా చేస్తారని కూడా ప్రచారం సాగింది.కాగా ఢిల్లీలో తాను పనులు చక్కబెడతానని చెప్పుకుని ఏపీ సీఎంఓలో అంతులేని అధికారాన్ని అనుభవించారని ప్రవీణ్ ప్రకాష్ విమర్శలు ఎదుర్కొన్నారు. రశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి స్థానం నుంచి ప్రవీణ్ ప్రకాష్ ను ఏపీ ప్రభుత్వం గత నెలలో బదిలీ చేసింది. దాంతో ఆయన వీఆర్‌ఎస్ నిర్ణయం తీసుకున్నారు. ప్రవీణ్ ప్రకాష్ స్థానంలో కోన శశిధర్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. అయితే వైసీపీ హయాంలో తాను అధికార పక్షంతో అంటకాగినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రవీణ్ ప్రకాష్ స్పందించారు. తాను ఎవరినీ లక్ష్యంగా చేసుకుని పనిచేయలేదని, పాఠశాల విద్యాశాఖలో తాను కావాలని ఎవర్నీ అవమానించలేదని ఓ వీడియో విడుదల చేయడం తెలిసిందే. తాను ఎవరినైనా టార్గెట్ చేశానని అనిపిస్తే తనను క్షమించాలని చేతులు జోడించి ప్రార్థిస్తున్నానన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బందిని తాను తనిఖీల పేరుతో అవమానించాను అనే వదంతుల్లో వాస్తవం లేదన్నారు. విద్యా శాఖలో, విద్యా వ్యవస్థలో మార్పు కోసం, మెరుగైన వ్యవస్థ కోసం మాత్రమే పని చేశానని సీనియర్ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాష్ వెల్లడించారు.వైసీపీ ప్రభుత్వంలో వివాదాస్పద నిర్ణయాలతో అందరికి దూరమైన ప్రవీణ్ ప్రకాష్ విజయవాడ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో ఎవరిని ఖాతరు చేయకుండా రోడ్ల విస్తరణ చేపట్టారు. 20ఏళ్ల క్రితం నగరంలోని ప్రధాన రోడ్ల విస్తరణ ప్రవీణ్ ప్రకాష్ కమిషనర్‌గా ఉన్న సమయంలోనే చేపట్టారు. నగర అవసరాలకు అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టారు.2002-2003 మధ్య కాలంలో విజయవాడలోని ఎంజి రోడ్డు, కార్ల్ మార్క్స్ రోడ్ల విస్తరణ చేపట్టారు. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చినా వెనుకంజ వేయలేదు. నగరంలో పెరిగిన రద్దీని అప్పుడు విస్తరించిన రోడ్లు కొంత మేరకు ఆదుకుంటున్నాయి. పాతబస్తీ వంటి ఇరుకు ప్రాంతాల్లో కూడా రోడ్లను విస్తరించి ఘనత ప్రవీణ్ ప్రకాష్‌కే దక్కింది. బ్రాహ్మణ వీధి, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రోడ్డు, కేటీ రోడ్డు, బిఆర్టీ రోడ్లను కూడా ప్రవీణ్ ప్రకాష్ విస్తరించారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు ఎవరు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఆ స్థాయిలో ప్రభావం చూపించలేకపోయారు.

# మళ్లీ రాజకీయాల్లోకి మాజీ ఎంపీ మురళీమోహన్




రాజమండ్రి, జూలై 11, టాలీవుడ్ సీనియర్ నటుడు, రాజమండ్రి మాజీ ఎంపీ మురళీమోహన్ మళ్లీ రాజకీయాల్లోకి రానున్నారా? మరోవైపు చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మురళీమోహన్ రాజకీయాలు చేసే ఛాన్స్ ఉందని ప్రచారం జరుగుతోంది. తన పొలిటికల్ రీఎంట్రీపై రాజమండ్రి మాజీ ఎంపీ మురళీమోహన్ స్పందించారు. ఏపీ సీఎం చంద్రబాబు తనను ఆహ్వానించిన మాట నిజమనేనని, అయితే మళ్లీ రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదన్నారు. రాజమండ్రికి వచ్చిన సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ.. రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడుగురు ఎమ్మెల్యేలను, రాజమండ్రి ఎంపీగా గెలుపొందిన దగ్గుబాటి పురంధేశ్వరిని అభినందించాలని వచ్చినట్లు తెలిపారు. తన హయాంలో ప్రారంభించిన ఫ్లైఓవర్, ఈఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణాలను పరిశీలించినట్లు తెలిపారు. తన సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని రాజకీయాలు చేశానని, డబ్బులు ఎలా సంపాదించాలో తనకు తెలుసునని, అక్రమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్ తన మీద చేసిన ఆరోపణల్ని మురళీమోహన్ ఖండించారు. తాను ఇసుక అమ్ముకున్నానంటూ మాజీ ఎంపీ భరత్ తనపై నిరాధార ఆరోపణలు చేశారంటూ మండిపడ్డారు. రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రాజకీయాల్లో రాణిస్తున్నారని, ఆయనకు తన మద్దతు ఉంటుందన్నారు. మోరంపూడి ఫ్లైఓవర్ ఫ్లైఓవర్ ఎవరు శంకుస్థాపన చేశారో మాజీ ఎంపీ మార్గాని భరత్ గుండె మీద చేయి వేసుకొని చెప్పాలన్నారు. ఈ ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తా అన్నారు. మార్గాని భరత్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. తన ప్రెస్ మీట్ ను లక్షల మంది చూస్తారని, ఆదిరెడ్డి వాసు మాట్లాడితే వేలల్లోనే చూస్తారంటూ చేసిన వ్యాఖ్యలపై ట్రోల్ చేశారు.మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణానికి మాజీ ఎంపీ మురళీమోహన్ చాలా కృషి చేశారని రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. కానీ ఒకే నిర్మాణానికి రెండు శిలాఫలకాలు భారతదేశంలో ఎక్కడా చూడబోమని, ఏపీలో వైసీపీ పాలనతో అది సాధ్యమైందని ఎద్దేవా చేశారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలో మార్గాని భరత్ ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదన్నారు. ఒకవేళ మాజీ ఎంపీ మార్గాని భరత్ నిజంగా రాజమండ్రిని అభివృద్ధి చేసి ఉంటే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు 70 వేల మెజారిటీ వచ్చేది కాదన్నారు. పెద్దలను గౌరవించడం నేర్చుకుంటే రాజకీయ ఉనికి ఉంటుందని మార్గాని భరత్‌కు టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హితవు పలికారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ.. హైవేలపై మరమ్మత్తులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. మాజీ ఎంపీ మురళీమోహన్ సమయంలోనే మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మోరంపూడి ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రం రూ. 100 కోట్లు నిధులు ఇస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ హయాంలో రోజుకి 30 కిలోమీటర్ల హైవే రోడ్ల నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, బలమైన ఆర్థిక శక్తిగా ఎదగాలంటే మౌలిక సదుపాయాలు కావాలన్నారు.

# పాలనలోనూ.. పవన్ మార్క్,,,



కాకినాడ, జూలై 11, సినిమాల్లో ట్రెండ్ సెట్ చేసే పవన్ కల్యాణ్.. పాలనా వ్యవహారాల్లోనూ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తున్నారు. డిప్యూటీ సీఎంగా పిఠాపురం అభివృద్ధిపై దృష్టి పెట్టిన ఆయన.. నియోజకవర్గంలోని సమస్యలపై అధ్యయనం చేయిస్తున్నారు. అయితే.. పిఠాపురం మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై సర్వే చేయిస్తూ సరికొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు. పిఠాపురం మున్సిపాలిటీలోని సమస్యలు, మౌలిక వసతులపై సర్వే అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఈక్రమంలో.. పిఠాపురంలో అనేక సమస్యలు గుర్తించి మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇక.. పిఠాపురం నియోజవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేలా వేగంగా అడుగులు వేస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. పిఠాపురం అభివృద్ధికి సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అటు.. పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై.. పిఠాపురం సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. పిఠాపురంపై వరుసగా సమీక్షలు చేస్తూ అధికారులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నారు. ప్రజా సంక్షేమం విషయంలో రాజీ పడకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రతి విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తంగా చేస్తున్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో కలెక్టర్ చేపట్టే ప్రజా సమస్యల పరిష్కార వేదిక లాంటి కార్యక్రమాన్ని కూడా నెలలో రెండు వారాలు పిఠాపురంలోనే ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు.. ప్లాస్టిక్ భూతంపై యుద్ధాన్ని ప్రకటించారు పవన్ కల్యాణ్. తాజాగా.. కాలుష్య నియంత్రణపై రివ్యూ చేసిన పవన్.. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ప్రకటించారు. సొంత నియోజకవర్గమైన పిఠాపురం నుంచే కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఇలాంటి సమయంలోనే పిఠాపురం మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై ప్రత్యేక అధికారుల బృందంతో పవన్‌కళ్యాణ్ సర్వే చేయిస్తుండడం హాట్‌టాపిక్‌గా మారింది.

# ఏపీ కాంగ్రెస్ ఫ్యూచర్ లేనట్టేనా



విజయవాడ, జూలై 11, ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ గాడిన పడే పరిస్థితి కనిపించడం లేదు. దేశమంతా కాంగ్రెస్ కు అనుకూలత కనిపిస్తున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం అస్సలు కొరుకుడు పడటం లేదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావస్తుంది. రాష్ట్ర విభజన జరిగిన మూడు ఎన్నికల్లో ఒక్క స్థానంలోనూ గెలవలేకపోయిందంటే ఆ పార్టీ పట్ల ప్రజలు ఎంత వ్యతిరేకత పెంచుకున్నారో ఇట్టే అర్థమవుతుంది. వరసగా మూడుసార్లు అనేక ప్రయోగాలు చేశారు. కానీ ఏ ప్రయోగం విజయవంతం కాలేదు. సరికదా కాంగ్రెస్ ను కలుపుకోవడానికి కూడా ప్రధాన పార్టీలు ఎవరూ ముందుకు రావడం లేదంటే ఆ పార్టీ పరిస్థితి చెప్పకనే తెలుస్తుంది. వైఎస్ షర్మిల రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకల పేరిట చేస్తున్న హడావిడికి ఎంత మాత్రం స్పందన వస్తుందన్నది చూడాలి. వైఎస్ షర్మిలను నమ్మి నేతలు ఎవరూ వస్తారన్నది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్నే. ఆంధ్రప్రదేశ్ లో జాతీయ పార్టీలకు స్థానం లేదు. అయితే కేంద్రంలో అధికారంలో ఉండటంతో బీజేపీకి కొంత సానుకూలత ఉంది. ఇక్కడ ఏ పార్టీ పార్లమెంటు స్థానాలను గెలిచినా అన్నీ బీజేపీ ఖాతాలోనే గత పదేళ్ల నుంచిపడుతూ వస్తున్నాయి. అందుకే బీజేపీకి ప్రత్యేకంగా వచ్చే నష్టమేమీ లేదు. కానీ కాంగ్రెస్ కు అలా కాదు. ఇటు రాష్ట్రంలో బలంగా ఉన్న టీడీపీ కానీ, వైసీపీ కాని కాంగ్రెస్ ను కలుపుకుని పోవడానికి ఇష్టపడటం లేదు. మొన్నటి ఎన్నికల్లో కేవలం బలం లేని కమ్యునిస్టులు విధిలేని పరిస్తితుల్లో జత కట్టారు. రాష్ట్ర విభజన చేసిన పార్టీగా ఇప్పటికీ ప్రజలు కాంగ్రెస్ ను దూరం పెడుతున్నారన్న భయంతో దానిని దగ్గరకు కూడా రానివ్వడం లేదు. నిజానికి ఏపీలో జాతీయ పార్టీలకు స్థానం లేదు. కేవలం ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరిస్తూ వస్తున్నారు. కాంగ్రెస్ నేతలు, క్యాడర్ గంపగుత్తగా వైసీపీ కి వెళ్లిపోయారు. కొద్దో గొప్పో నేతలున్నప్పటికీ వారు బయటకు వచ్చి పార్టీ బలోపేతానికి పనిచేసేవారు కారు.కాంగ్రెస్ మూడు ఎన్నికలకు ముందు అనేక ప్రయోగాలు చేసింది. తొలిసారి పీసీసీ చీఫ్ గా రఘువీరారెడ్డిని నియమించింది. 2014లో అప్పుడే రాష్ట్ర విభజన జరగడంతో ఆగ్రహించిన ప్రజలు ఆ పార్టీని దగ్గరకు కూడా రానివ్వలేదు. ఇక 2019 ఎన్నికలసమయంలో దళిత వర్గానికి చెందిన సాకే శైలజానాథ్ కు పార్టీ పగ్గాలు అప్పగించారు. అయితే అప్పుడు కూడా జనం ఆదరించలేదు. రెండుసార్లు శాసనసభలోకి కాంగ్రెస్ సభ్యులు కాలుమోపలేకపోయారు. జనం ఆగ్రహం ఇంకా తగ్గలేదని సర్దిచెప్పుకున్నారు.ఎన్నికలకు ముందు వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయ షర్మిలను పీ?సీ?సీ చీఫ్ గా నియమించి మరో ప్రయోగం చేశారు. అయితే ఎన్నికలకు ముందు కొంత ఊపు కనిపించినట్లు కనిపించింది కానీ ఫలితాలు మాత్రం కనపడలేదు. కనీసం కడప లాంటి చోట షర్మిల కూడా గెలవలేకపోయారు. ఇక ఎన్నికలకు ముందు వైసీపీ టిక్కెట్ దక్కని వారు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికలు ముగిసినతర్వాత ఫలితాలను చూస్తే మూడు శాతం ఓట్లు మాత్రమే కాంగ్రెస్ కు రావడంతో ఇక వైసీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చే వాళ్లు కూడా ఎవరూ ఉండకపోవచ్చు. వైఎస్ షర్మిలది ఏపీలో కాంగ్రెస్ ఆఖరి ప్రయోగంగానే చెప్పుకోవాలి. అంతకు మించి మరొకరిని నియమించినా ప్రయోజనం ఉండదు. ఇక కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తప్ప ఏపీలో కాంగ్రెస్ కు మంచి రోజులు రావన్నది నిజం.

# టీడీపీ కార్యాలయంపై దాడి కేసు

## నిందితులను రిమాండ్ కు తరలింపు

గన్నవరం,గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో నిందితులను పోలీసులు కోర్ట్ లో హాజరు పర్చారు. వైద్యపరీక్షల అనంతరం 15మంది నిందితులను కోర్ట్ కు తీసుకొచ్చారు. దాడి కేసులో సీసీ ఫుటేజ్, వీడియోల ఆధారంగా గుర్తించిన 93 మందిలో 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. గన్నవరం జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ లో15 మంది నిందితులను ప్రవేశపెట్టారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకు రిమాండ్ ను సివిల్ జడ్జి కోర్టు పరిశీలించారు. ఈనెల 24వ తారీఖు వరకు 14 రోజులు రిమాండ్ విధించారు. దాంతో నిందితులను నూజివీడు జైలుకు తరలించారు.

# దర్శిని హత్య కేసు నిందితుడు సురేష్ ఆత్మహత్య

అనకాపల్లి,అనకాపల్లి జిల్లా: రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బద్ధి దర్శినిని దారుణంగా హత్య చేసిన కేసు లో నిందితుడు సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. రాంబిల్లి మండలం కొప్పుగుండుపాలెం శివారులో సురేష్ మృతదేహం గుర్తించార. ఈనెల ఆరవ తేదీన శనివారం 9వ తరగతి విద్యార్థిని దర్శినిని గొంతు కోసి చంపిన ప్రేమోన్మాది సురేష్, పాఠశాల నుంచి ఇంటికి వచ్చి స్నానం చేసి గదిలోకి వెళ్లిన దర్శినిని కత్తితో నరికి చంపాడు.అప్పటినుంచి నిందితుడి కోసం 14 పోలీసు బృందాలు రాష్ట్రవ్యాప్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి.. ఇతని ఆచూకీ చెప్పిన వారికి 50 వేల రూపాయల నగదు బహుమతిని పోలీసు వారు ప్రకటించారు..

ఈ నేపథ్యంలో బుధవారంసురేష్ మృతదేహం గ్రామ శివారులో కనిపించింది.. ఇతని మృతదేహం బాగా కుళ్ళిపోవడంతో ఇతను ఆత్మహత్య ఎలా చేసుకున్నది తెలియ రాలేదు.. అయితే ఒంటి మీద ఎటువంటి గాయాలు లేవని పోలీసులు చెబుతున్నారు.. మృదేహాన్ని స్వాధీనం చేసుకొని శివ పరీక్ష కోసం అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.. విద్యార్థిని దర్శిని హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.. దీన్ని ప్రభుత్వం కూడా సీరియస్గా తీసుకొని ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించింది. ఈ కేసులో నిందితుడు తక్షణం పట్టుకోవాలని హోం శాఖ మంత్రి అనిత పోలీసులను ఆదేశించిన విషయం తెలిసిందే

# తిరుమలలో మొదలైన ప్రక్షాళన.!

తిరుమల, జూలై 11, తిరుమల.. కలియుగ వైకుంఠం. దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచమంతా భక్తులున్న దివ్యక్షేత్రం. శ్రీనివాసుడు ఆపద మొక్కులవాడు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం. అందుకే ఆ కలియుగ దైవం దర్శనం కోసం .. ఎక్కడెక్కడి నుంచో సామాన్య భక్తులు వ్యవయప్రయాసలకు ఓర్చి ఏడు కొండలెక్కి వసతులున్నా లేకున్నా రోడ్లపై పడిగాపులు కాస్తారు. కంపార్ట్‌మెంట్లలో గంటలకు గంటలు ఎదురు చూస్తారు. కిక్కిరిసిన క్యూలైన్లలో తోసుకుంటూ.. ఆనందనిలయం ముందు దివ్యదర్శనానికి అడుగుపెడతారు. అరసెకనులో గర్భగుడి బయట క్యూలైన్లలో ఉన్న సామాన్య భక్తులను సిబ్బంది లాగి అవతల పడేస్తుంటే.. అరసెకను ఆ వేంకటేశ్వరుడి దివ్య దర్శనం చేసుకుని అరమోడ్పు కన్నులతో ఆలయం బయటకు చేరతారు. ఇది తిరుమల క్షేత్ర దర్శనం అనగానే మనకు గుర్తుకొచ్చేవి. తిరుపతిలో అడుగు పెట్టింది మొదలు.. మళ్లీ తిరుమలలో దర్శనం ముగించుకుని కొండ దిగే వరకు సామాన్య భక్తులకు ఎన్నో అవస్థలు.. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలక మండళ్లు మారుతున్నా నిత్యం భక్తుడికి ఆ వెంకన్న దర్శనం అంటే కేవలం దైవదర్శనం మాత్రమే కాదు. సమస్యలను ముందు దర్శించి వాటిని అధిగమించి ఆ తర్వాతగానీ శ్రీనివాసుడిని దర్శించుకోవడం సాధ్యం కాదు. భార్యాభర్తలు, పిల్లపాపలు, వృద్ధులు ఇలా కుటుంబాలతో కలిసి శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వస్తుంటారు సామాన్య భక్తులు. కొండపైకి రాగానే వాళ్లకు ముందు వసతి పెద్ద సమస్యగా మారుతుంటుంది. కాటేజీలున్నా.. భక్తుల రద్దీకి తగినంత ఉండవు. రోజురోజుకీ తిరుమలకు వచ్చే భక్తులు పెరుగుతూనే ఉన్నారు. కానీ.. కొండపై ఆ రద్దీని తట్టుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించడం పెను సవాలే. వీఐపీ భక్తులకు ప్రత్యేకమైన కాటేజ్‌లు, వసతులున్నాయి. బ్రేక్ , స్పెషల్ పేరుతో రెండు మూడు గంటల్లోనే వెంకన్న దర్శనం పూర్తవుతుంది. సామాన్య భక్తులకు



వసతి సముదాయాలు అంతంత మాత్రమే. కొండపై వీఐపీలకే ప్రాధాన్యమిస్తున్నారని వారి సేవలోనే టీటీడీ తరిస్తోందన్న ఆరోపణలు పెరిగాయి. వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్నా టీటీడీ మాత్రం ఉన్న కాటేజీలతోనే సర్దుబాటు చేస్తోందని.. సామాన్య భక్తులకు కొత్త కాటేజీలు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. వారాంతాలు, పర్వదినాలు, సెలవులు, బ్రహ్మోత్సవాలు.. ఇలాంటి సమయాల్లో తిరుమలకు రద్దీ విపరీతంగా పెరుగుతూ ఉంటుంది. అప్పుడు భక్తులు పడే అవస్థలు అన్నీఇన్నీ కావు. ఓవైపు తమ ఇలవేల్పు, నమ్మిన దైవమైన వేంకటేశ్వరుడిని దర్శించుకోవాలి. అంతకు ముందు కొండపై క్యూలైన్లలో సమస్యలతో సావాసం చేసి ముందుకు సాగాలి. రద్దీ సమయాల్లో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోతాయి. వెలుపలకు కిలోమీటర్ల క్యూలైన్లు కనిపిస్తాయి. చిన్నపిల్లలతో వచ్చినవాళ్లు, వృద్ధులు ఆ క్యూలైన్లు, కంపార్టమెంట్లలో ముందుకు నడవడమంటే కత్తిమీద సామే. అలాంటి వారికి ప్రత్యేక వసతులు కల్పించి వీలైనంత త్వరగా దర్శనం పూర్తి చేయించాల్సిన అవసరముందనేది భక్తుల నుంచి వస్తున్న విన్నపం. కంపార్ట్‌మెంట్లలో దర్శనం కోసం గంటల తరబడి వేచి చూడాలి. అక్కడ పలు ప్రాంతాలకు చెందిన భక్తులుంటారు. పెరుగన్నం, పులిహోర, సాంబార్ రైస్ ఇలా ప్రసాదాలను కంపార్టమెంట్లలో భక్తుల ఆకలి తీర్చేందుకు టీటీడీ అందిస్తుంటుంది. వీటి నాణ్యత విషయంలో భక్తుల నుంచి రకరకాల కంప్లైంట్స్ అందుతున్నాయి. నిత్య అన్నదాన సత్రంలో అన్నప్రసాదం క్వాలిటీపైనా రకరకాల విమర్శలున్నాయి. దర్శనానంతరం శ్రీవారి దివ్యప్రసాదంగా లడ్డూను భక్తులకు అందిస్తారు. వీటి తయారీ, నాణ్యత, లడ్డూ సైజ్‌పై కూడా ఫిర్యాదులు ఈమధ్యకాలంలో పెరిగాయి. ఒకప్పుడు లడ్డూ వారం రోజులు నిల్వ ఉన్నా ఎలాంటి దుర్వాసన వచ్చేది కాదు. కానీ.. అందులో వాడే సరుకుల క్వాలిటీలోపం కారణంగా రెండ్రోజులకే లడ్డూ ప్రసాదం చెడుపోతోందన్న కంప్లైంట్స్ వ్యక్తమవుతున్నాయి. వీటిపైనా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలనేది భక్తుల ఆవేదన. ప్రక్షాళన తిరుమల నుంచే మొదలు పెడతామని ఏపీ సీఎం చంద్రబాబు శ్రీవారి దర్శనార్థం కొండకు వచ్చిన సందర్భంగా స్పష్టం చేశారు. భక్తులు ఎదుర్కొనే సమస్యలు ఒకవైపు ఉంటే.. గత పాలకమండలిపై విమర్శలు, అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ముందుగా టీటీడీ పాలకమండలి ఈవోను మార్చి కొత్త ఈవోగా శ్యామలరావుకు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. ఏయే వ్యవస్థల్లో లోపాలున్నాయో గుర్తించి సరిచేసేందుకు స్టేట్‌లెవల్ విజిలెన్స్ కమిటీ రంగంలోకి దిగింది.

## హాట్ టాపిక్ గా జగన్ రాజీనామా



కడప, జూలై 11, మాజీ సీఎం జగన్.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కడప ఎంపీగా పోటీ చేస్తారని విస్తృత ప్రచారం జరుగుతోంది. దీనిపై వైసీపీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవటంతో ఆ పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నాయి. జఅఖ మౌనం అంగీకారమా? లేక ఎప్పట్లాగే ఉదాసీనతా ? అనేది అర్థం కావడం లేదనే చర్చ సాగుతోంది. ఇంతకీ.. జగన్ రిజైన్ చేయటం ఏమిటి? అసలు.. ఆ వార్తలెలా వస్తున్నాయిఏపీలో జగన్ రాజీనామా అంశం హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం అయిన వైసీపీ అధినేత.. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోసం స్పీకర్‌కు లేఖ రాశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తమ పార్టీకి ప్రతిపక్ష హోదా రాదని నిర్ధారించుకున్న తర్వాత.. ఆయన ఢిల్లీ వేదికగా రాజకీయాలు చేయాలని యోచనలో ఉన్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ వార్తలను అటు జగన్ కానీ ఇటు వైసీపీ నేతలు కానీ ఖండించకపోవటం చర్చనీయాంశంగా మారింది. కొందరు వైసీపీ నేతలు మాత్రం ఇదంతా టీడీపీ చేస్తున్న ప్రచారమని చెబుతున్నారు. అంతేకాని జగన్ రాజీనామా చేస్తారన్న వార్తల్ని ఖండించడం లేదు. అంటే జగన్ రాజీనామా చేయడం నిజమా ? అవినాష్ తో ఎంపీగా రాజీనామా చేయించి.. సైడ్ చేస్తారా ? కుటుంబంలో ఉన్న వ్యతిరేకతను పోగొట్టుకునేందుకు ఈ ఎత్తు వేశారా లేక.. అసెంబ్లీలోకి వెళ్లడం ఇష్టం లేక అలా చేయాలని ప్లాన్ చేశారా ?ఇటీవలే జరిగిన జూఖీ జయంతి కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరో మలుపు తిప్పాయి. ఒకవేళ కడపలో ఉపఎన్నిక జరిగితే.. ంఖఅఅ అధ్యక్షురాలైన షర్మిలను గెలిపించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్లి.. ఓట్లు అడుగుతానని ఆయన సభలో బహిరంగ ప్రకటన చేశారు. దీంతో ఉపఎన్నికకు సంబంధించిన వార్తలకు మరింత బలం చేకూరినట్లు అయింది. పోగొట్టుకున్న చోటే వెతకాలన్న సామెత ప్రకారం ఏపీ కాంగ్రెస్ పావులు కదుపుతోందని వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీ బలోపేతం కోసం ఎలాంటి సహాయమైనా చేయడానికి తాము సిద్ధమంటూ ంఖఅఅ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. కడప ఎంపీ ఉపఎన్నిక ఖాయమైతే.. షర్మిల, జగన్ ల మధ్య హోరాహోరీ పోటీ ఖాయం. రేవంత్ రెడ్డి బరిలోకి దిగి షర్మిలకు సపోర్ట్ చేస్తే.. జగన్ ఓడిపోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలంటే కాంగ్రెస్ శ్రేణులంతా ఒక్కటై పని చేయాలంటూ తెలంగాణ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు.. హస్తం నేతలను ఆలోచనలో పడేశాయని రాజకీయవర్గాలు చెప్పుకుంటున్నాయి. ఇప్పటికైనా జగన్ రాజీనామాపై వైసీపీ అధిష్టానం మౌనం వీడాలి. లేదంటే వైసీపీ నాయకులు, కార్యకర్తల్లో గందరగోళానికి కారణమవుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థుల మైండ్‌గేమ్‌కు వైసీపీ మౌనం అగ్గికి ఆజ్యం పోసినట్టు అవుతుందని అంటున్నారు. జగన్ రాజీనామా ప్రచారంపై ఇప్పటికైనా వైసీపీ పెద్దలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

## జెడ్పీ పీఠంపై గొట్టిపాటి గురి

ఒంగోలు, జూలై 11, ఉమ్మడి ప్రకాశం జిల్లా రాజకీయాలు మంచి జోరుమీద కనిపిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పది నియోజకవర్గాల్లో విజయం సాధించిన టీడీపీ? జిల్లా పరిషత్‌లోనూ జెండా ఎగరేయాలని ప్లాన్ చేస్తోంది. జిల్లాలో 56 మండలాలు ఉంటే.. వైసీపీకి 55 మంది జడ్పీటీసీలు ఉన్నారు. మిగిలిన ఒక్కస్థానంపై కోర్టులో వివాదం కొనసాగుతోంది. అసలు ఒక్క సభ్యుడూ లేని జడ్పీని టీడీపీ కైవసం చేసుకుందామని ప్లాన్ చేయడమే రాజకీయంగా ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఒక్కరూ లేనిచోట టీడీపీ జెండా ఎలా ఎగురుతుందనేది ఉత్కంఠకు కారణమవుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రస్తుతం బూచేపల్లి వెంకాయమ్మ వ్యవహరిస్తున్నారు. ఈమె దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తల్లి. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు సన్నిహితుడైన బూచేపల్లి 2019 ఎన్నికల్లో పోటీ చేయకపోవడంతో 2022లో జరిగిన ఎన్నికల్లో ఆయన తల్లికి జడ్పీ చైర్‌పర్సన్ కట్టబెట్టింది వైసీపీ. జడ్పీలో సంపూర్ణ బలం ఉండటంతో చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు వెంకాయమ్మ. ఇక అసెంబ్లీ ఎన్నికల వరకూ జడ్పీలో చక్రం తిప్పిన బూచేపల్లికి? రాష్ట్రంలో అధికారం మారడంతో పరిస్థితులు ప్రతికూలంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో దర్శి నుంచి పోటీ చేసిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్వల్ప ఓట్లతో గెలిచారు. అది కూడా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోదరుడి కుమార్తె డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీపై గెలిచారు. జిల్లాలో పది చోట్ల గెలిచిన టీడీపీ, దర్శిలో ఓటమిని జీర్ణించుకోలేకపోతోంది. దీనికి ప్రతీకారంగా జడ్పీలో వైసీపీని గద్దె దించాలని ప్లాన్ చేస్తోంది. దర్శిలో ఓడిన గొట్టిపాటి లక్ష్మిని జడ్పీ చైర్‌పర్సన్ చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వ్యూహం రచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే మంత్రి గొట్టిపాటి అనుకున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ పదవి నుంచి బూచేపల్లి వెంకాయమ్మను దింపడం అంత ఈజీ కాదనే విశ్లేషణలు ఉన్నాయి. మంత్రి గొట్టిపాటి తలచుకుంటే అదేమీ పెద్ద పనికాదనే అభిప్రాయం జిల్లాలో వినిపిస్తోంది. 55 మంది సభ్యుల్లో 28 మందిని టీడీపీలో చేర్చుకుంటే జడ్పీ పీఠం టీడీపీ వశమవుతుందని లెక్కలు వేస్తోంది టీడీపీ. ఇందుకోసం ఆపరేషన్ స్టార్ట్ చేసింది. ఎన్నికల ముందు వైసీపీ నుంచి నలుగురు జడ్పీటీసీలు టీడీపీలో చేరగా, మరికొందరు ప్రస్తుతం మంత్రి గొట్టిపాటితో టచ్‌లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం టీడీపీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకో 24 మంది సభ్యులు అవసరం కాగా, మంత్రితో టచ్‌లో ఉన్నవారు? పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నవారు లిస్టు చాలా ఎక్కువే ఉందంటున్నారు. దీంతో వైసీపీలో అలజడి మొదలైందని చెబుతున్నారు. జడ్పీ పీఠం నుంచి చైర్‌పర్సన్‌ను దించేయాలంటే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నాలుగేళ్లు తర్వాతే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అంటే ఇంకో రెండేళ్లు వేచి చూడాల్సి ఉంటుంది. పంచాయతీలు, గ్రామాల అభివృద్ధిలో జడ్పీ కీలకంగా ఉండటంతో జడ్పీ పీఠం తమ ఆధీనంలో ఉండాలని భావిస్తున్న టీడీపీ అవసరమైతే? పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించే విషయాన్ని పరిశీలిస్తోందంటున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

**జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్**

**బయాలజికల్ సైన్స్ ఉపాధ్యాయుడి పై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్**

**మధ్యాహ్నం భోజనంలో ఉడకని బంగాళదుంప కూర..వడ్డించడం పై కలెక్టర్ ఆగ్రహం**

బద్వేలు , జూలై 11, పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి 100 శాతం ఫలితాలను సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. బద్వేలు నియోజకవర్గం శ్రీ అవధూత కాశినాయన మండలం, నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాల, ప్రైమరీ హెల్త్ సెంటర్, తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్లను మండల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నరసాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు బాల ఓబయ్య బోధించే బయాలజికల్ సైన్స్ క్లాస్ లో విద్యార్థుల మధ్యలో కూర్చుని ఆయనబోధించే పాఠ్య బోధనను విన్నారు. ఆ ఉపాధ్యాయుడు సరిగ్గా చెప్పడం లేదని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి ముందు పూర్తి గా ప్రిపేర్ అయ్యి రావాలి కదా.. ఇలా చెప్తే విద్యార్థులకు ఏమి అర్థం అవుతుందని సంబంధిత ఉపాధ్యాయుడుపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు బోధించే ముందు ఉపాధ్యాయులందరు పాఠ్యాంశాలలోని వివిధ అంశాలపై ముందస్తుగా ప్రిపేర్ అయ్యి విద్యార్థులకు బోధించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారి జీవిత ఆశయ వివరాలు అడిగి తెలుసు కున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిర్విరామంగా కృషి చేయాలన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని విద్యార్థులకు సూచిస్తు, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. అనంతరం స్వయంగా ఆయన పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. బంగాల దుంప కర్రీ సరిగా ఉడకలేదని సంబంధిత ఇన్చార్జిలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఇప్పటినుండి పద్ధతులు మార్చుకొని పిల్లలకు అందించే భోజనంలో మంచి ఆహారం అందించకపోతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్టాఫ్‌రూంలో టీచర్లతో సమావేశమై పాఠశాలలో అందిస్తున్న విద్యా ప్రమాణాలు, చదువులో వెనకబడిన విద్యార్థుల కోసం తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన విద్యాప్రమాణాలు అందించేందుకు తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు జారీ చేశారుఅనంతరం ప్రైమరీ హెల్త్ సెంటర్, తహశీల్దార్ ఆఫీసు, పోలీస్ స్టేషన్లను సందర్శించి అక్కడ పనిచేసే సిబ్బందికి తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకుని ప్రజలకు మెరుగైన సేవలను ఆలస్యం లేకుండా అందించాలని ఆదేశించారుఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్, మండల రెవెన్యూ అధికారి,మండల విద్యాధికారి,పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు భవిష్యత్ పై ఆశలు

విశాఖపట్టణం, జూలై 11 విశాఖ స్టీల్ ప్లాంటులో కేంద్రమంత్రి హెచ్ డి కుమార స్వామి పర్యటిస్తున్నారు. ఉక్కు పరిశ్రమ స్థితిగతులను పరిశీలిస్తున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఇప్పుడు అందరి చూపు విశాఖ ఉక్కు కర్మాగారంపై పడింది. గత మూడు సంవత్సరాలుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయంపై కార్మికుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో విశాఖకు వచ్చిన కేంద్రం ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ పై ఎలాంటి నిర్ణయం వెలువరిస్తారో అన్న ఆసక్తి ఉత్కంఠ అటు రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా యావత్ దేశంలో నెలకొంది. అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఉక్కు పరిశ్రమకు చేరుకున్న కేంద్ర మంత్రి కుమార స్వామి, ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాలు నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంతో విశాఖ ఉక్కు భవిష్యత్తై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ప్రస్తుతం ఉద్యోగుల ఆందోళన, జీతాలు సరిగా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. సంస్థ నిర్వహణకు ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితిలో ఉన్న ఉక్కు కర్మాగారానికి, కేంద్రమంత్రి రాకతో పరిస్థితి మారుతుందా? సెయిల్‌లో విలీన ప్రతిపాదనపై ఎలా స్పందిస్తారనేది కీలకంగా మారింది. దీనిపై సానుకూలంగా స్పందించాలని ఈ మధ్యే ఏపీ బీజేపీ ఎంపీలు కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామిని కలిశారు. స్టీల్ ప్లాంట్పై ఇక్కడ ప్రజల ఆకాంక్షలు, ప్రైవేటీకరణ విషయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన్ని కోరారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో, రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్‌ను విలీనం చేయడం వల్ల రెండు కంపెనీలు లాభపడతాయని వారు కుమారస్వామికి వివరించారు. ఇలా ఒక ప్రతిపాదన పెట్టిన 20 రోజుల్లో నేరుగా కేంద్ర మంత్రి పర్యటించడంతో ఏదో ఒక సానుకూల నిర్ణయం వెలువడుతుందని ఆశగా ఎదురు చేస్తున్నారు ప్రజలు. ఇదిలా ఉంటే విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని కేంద్ర మంత్రి కుమార స్వామి సందర్శించి, వాస్తవ పరిస్థితులు ఏంటో తెలుసుకుంటారని మరో మంత్రి శ్రీనివాసవర్మ వెల్లడించారు. కేంద్రమంత్రి పర్యటనతో వెంటనే అద్భుతాలు జరగవన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం మంత్రుల పరిధిలో ఉండదని స్పష్టం చేశారు. ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. సెయిల్‌లో విలీనం ప్రతిపాదనలు ఉన్నాయి కాబట్టి స్టీల్ ప్లాంట్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల అవగాహనకోసమే కేంద్ర మంత్రి కుమార స్వామి పర్యటన కొనసాగుతోందన్నారు.

## ఆ ఐదుగురు అడ్డంగా బుక్కైయ్యారు

కాకినాడ, జూలై 11,ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ పోర్టు నుంచి పెద్ద ఎత్తున బియ్యం స్మగ్లింగ్ జరిగిందని గతంలో టీడీపీ, జనసేన పార్టీలు చేసిన ఆరోపణలకు ఇప్పుడు బలమైన ఆధారాలు లభిస్తున్నాయి. పౌరసరఫరాల మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దూకుడుగా అక్రమాలను వెలికి తీస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్ తాజాగా కీలక ప్రకటన చేశారు. కాకినాడ నుంచి జరిగిన బియ్యం స్మగ్లింగ్‌లో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉన్నట్లుగా తనకు సమాచారం వచ్చిందన్నారు. ఒక్క కాకినాడలోనే 43వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామంటే ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎంత భారీ స్థాయిలో అక్రమాలు జరిగి ఉంటాయో ఊహించడం కష్టమన్నారు. అధికారులు రాత్రింబవళ్లు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం బియ్యం స్కాం గుట్టు రట్టు చేస్తామని ప్రకటించారు. బియ్యం స్మగ్లింగ్‌లో ప్రధాన పాత్ర కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిదన్న ఆరోపణలు ఉన్నాయి. కాకినాడ పోర్టును ఆయన గుప్పిట్లో పెట్టుకున్నారని చెబుతున్నారు. అదే సమయంలో ఏపీ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కు ద్వారంపూడి తండ్రే అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ క్రమంలో ఐదేళ్ల పాటు పేదలకు ఇవ్వాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టించి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేశారని భావిస్తున్నారు. కాకినాడలోనే ఎమ్మెల్యేకు చెందిన వివిధ గోడౌన్లలో సోదాలు నిర్వహించి పెద్ద ఎత్తున బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఇంకా ఏమీ మాట్లాడలేదు. గతంలో చేసిన స్మగ్లింగ్‌కు అధికార సహకారం పూర్తి స్థాయిలో ఉందని.. స్మగ్లింగ్ బియ్యాన్ని గ్రీన్ చానల్ ద్వారా తరలించేవారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల సహకారం లేకపోతే ఇంత భారీ స్థాయిలో అక్రమాలు జరగవని ఐదుగురు ఐపీఎస్ అధికారులు ఈ స్కాంలో భాగం అయి.. పూర్తి స్థాయిలో సహకరించి దానికి తగ్గట్లుగా ఫలితం పొందారని చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే అధికార వర్గాల్లో గుసగుసలు ఉన్నాయి. ఇప్పుడు మంత్రి నాదెండ్ మనోహర్ నేరుగా ప్రకటించడంతో ఇక ఆ ఐదుగురు ఐపీఎస్ అధికారులపై కేసులు నమోదు చేయడం ఖాయమన అంచనా వేస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన మొత్తం స్కాములన్నీ కొత్త మంత్రి బయటకు తీయిస్తున్నారు. పేదలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల ప్యాకెట్లలో బరువు తక్కువ ఉండటం కూడా గుర్తించారు. కాంట్రాక్టర్లు అధికారులు కుమ్మక్కయి ప్రజాధనాన్ని పెద్ద ఎత్తున స్వాహా చేశారని నిగ్గు తేలుస్తున్నారు. మంత్రి నాదెండ్ల దూకుడతో పౌరసరఫరాల శాఖలో చక్రం తిప్పిన వారు తంటాలు పడుతున్నారు. తమ స్కాములు ఎక్కడ బయటపడతాయోనని ఆందోళన చెందుతున్నారు.

## మైనర్ బాలిక హత్య కేసు?నిందితుడు ఆత్మహత్య

విశాఖపట్నం,రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిం చిన అనకాపల్లి మైనర్ బాలిక హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుడు సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. అందరూ అనుమానించినట్లుగానే నిందితుడు బలవన్మరణానికి పాల్ప డ్డాడు. గత నాలుగు రోజులుగా నిందితుడి కోసం పోలీసులు 12 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే నిందితుడు ఫోన్ వాడకపోవడంతో అతడికి కనుగొనడం పోలీసులకు సవాల్గా మారింది. చివరకు రాంబిల్ల మండలం కొప్పుగుండు పాలెంలో నిందితుడు సురేష్ మృతదేహం లభ్యమైంది. కొప్పుగొండపాలెం పరిసరాలలో మృతదేహం బోర్లా పడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతదేహా న్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## గంజాయి స్వాధీనం

చింతూరు ,అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద చింతూరు సిఐ గజేంద్ర కుమార్,ఎస్సై గోపాలరావు వాహనాలు తనిఖీ చేపడుతుండగా 800 కేజీల గంజాయిని పట్టుకోవడం జరిగింది. ఈ గంజాయికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గంజాయిని తరలిస్తున్నట్టు పోలీసు అధికారులకు సమాచారం రావడంతో మోతుగూడెం పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వస్తున్న ఐచర్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 550 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది. అలాగే ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మరో ఘటనలో కారులో తరలిస్తున్న 250 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో ఒకరిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీ లో ఉన్నట్లు తెలిపారు. రెండు వేరు వేరు ఘటనలో పట్టుబడ్డ 800 కేజీల గంజాయి విలువ సుమారు 40 లక్షల రూపాయలు ఉంటుందని ఏఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. గంజాయిని పట్టుకున్న చింతూరు సిఐ గజేంద్ర కుమార్,ఎస్సై గోపాలరావు లను ఏఎస్పీ రాహుల్ మీనా అభినందించారు.

## ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్లు హోటల్లు తనిఖీ చేసిన అధికారులు

బద్వేలు,బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు హోటల్ లను ఆకస్మిక తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ ఫుడ్ సేఫ్టీ అధికారులు...ఫాస్ట్ ఫుడ్ మరియు హోటల్స్ లలో నిషేధిత ఫుడ్ కలర్స్ మరియు టేస్టింగ్ సాల్ట్ కల్తీ నూనెలు వాడుతూ ప్రజల ఆరోగ్యానికి దెబ్బతినేలా చేస్తున్నారని సమాచారంతోనే దాడులు నిర్వహించామని తెలిపిన కమిషనర్... ఈ దాడులలో నిషేధిత ప్లాస్టిక్ కవర్స్ స్పూన్స్ స్వాధీనం చేసుకున్నారు...ప్రజలు ఆరోగ్యం దెబ్బతినాలా చేసే ఫుడ్ కలర్స్ గాని నూనెలు కానీ వాడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ మరియు హోటల్ వారిని హెచ్చరించారు...

## అన్యమత పాలనపోయి గోవిందుడి పాలన వచ్చింది

తిరుమల,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం నాడు పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తరువాత అయన మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేసారు. ఏపీలో గత పాలకులు వీరప్పన్ వారసులు. నిలువు నామాలతో ప్రజలకు పంగ నామాలు పెట్టారు.

ఎర్రచందనం దోపిడీతో సర్కార్ కే అప్పులిచ్చే స్థాయికి ఎదిగారు. శేషాచల కొండల్లో ఎర్రచందనం దోపిడీపై నివేదిక కోరతాం. నాస్తికులకు, అన్యమతస్థులకు పదవులిచ్చి తిరుమల పవిత్రతకు భంగం కలిగించారు. నివేదిక ఆధారంగా జాతీయ సంపదను దోచుకున్న వారిపై చర్యలు తీసుకుంటామం. ఏడుకొండలను రెండు కొండలుగా మార్చాలనుకున్న అన్యమత పాలన పోయింది. అన్యమత పాలన పోయి గోవిందుడి పాలన వచ్చిందని అన్నారు.

## కల్తీ ఎరువులు పురుగు మందులు అమ్మితే లైసెన్స్ రద్దు.

ఏ.ఓ.రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-కల్తీ ఎరువులు, పురుగుమందులు అమ్మితే దుకాణాలను సీజ్ చేసి లైసెన్సు రద్దు చేస్తామని వ్యవసాయ అధికారి శ్రీకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో ఝాన్సీ ఆగ్రో ఏజెన్సీ, ఎరువులు మరియు పురుగుమందుల దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని కల్తీ ఎరువులు, పురుగుమందులు అమ్మితే అటువంటి మందుల దుకాణాల లైసెన్స్ రద్దు చేసి అటువంటి దుకాణాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. పలు రకాల ఎరువులను శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కి పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి : సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి



శ్రీ ప్రస్థానం-గడివేముల జులై 12:- గురువారం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ లో మధ్యాహ్న భోజన పథకం ను సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి తనిఖీ చేశారు. తదనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులను తమ కుటుంబసభ్యుల్లా భావించి నాణ్యమైన, రుచికర మైన భోజనాన్ని అందించాలన్నారు. మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

## తాత్కాలిక కుటుంబ నియంత్రణ పాటించండి ఆరోగ్యంగా జీవించండి.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్లు శివ మోహన్, జ్యోతి.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-తాత్కాలిక కుటుంబ నియంత్రణ పాటించండి ఆరోగ్యంగా జీవించండి అని ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శివ మోహన్, జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని ప్రజలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తాత్కాలిక కుటుంబ నియంత్రణ పాటించడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని వారు తెలుపుతూ ప్రతి తల్లి కాన్పుల మధ్య ఎడం పాటించడం వలన తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని మరియు బాల్యవివాహాలు చేసుకోవడం వలన చాలా సమస్యలు వస్తాయని కనుక సరైన వయస్సులో పిల్లలకు వారి తల్లిదండ్రులు పెళ్లిళ్లు చేస్తే మంచిదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# నిందితులను ఎన్ కౌంటర్ చేయాలి....

విద్యార్థులు విద్యార్థి సంఘాలు గర్జించాయి.......





శ్రీ ప్రస్థానం: పాణ్యం నియోజకవర్గం పాణ్యం మండల కేంద్రంలో ఆర్వీఎఫ్ , ఎ.ఐ.ఎఫ్.బి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనల నిర్వహించారు.అభం శుభం తెలియని నంద్యాల జిల్లా పగిద్యాల మండలం ముచ్చు మర్రి గ్రామంలో ఐదవ తరగతి చదువుతున్న 8 సంవత్సరాల వాసంతిని అదే గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ విద్యార్థులు గత ఆదివారం రోజున మాయమాటలతో వాసంతిని ఊరి బయటకు తీసుకువెళ్లి, అభం శుభం తెలియని చిన్నారి వాసంతిని అత్యాచారం చేసి హత్య చేయడం పట్ల పాణ్యంలోని డా"బిఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట జూనియర్ కాలేజీ విద్యార్థినిలు , నేతలు నిరసన , ధర్నా నిర్వహించారు.వాసంతిని అత్యాచారం చేసి , హత్యచేసిన ఆ ముగ్గును నిందితులను ఎన్ కౌంటర్ చేయాలని విద్యార్థినీలు గర్జించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామినేని రాజునాయుడు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్ , ఎ.ఐ.ఎఫ్.బి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం వెంకటాద్రి , బత్తిని ప్రతాప్ , ఆర్వీఎఫ్ పాణ్యం నియోజకవర్గ కార్యదర్శి బాలకృష్ణ నాయక్ తదితరులు మాట్లాడారు.

# నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు సామాన్యులకు అందుబాటులో ఉంచాలన్నదే లక్ష్యం



ఈ దిశగా సమష్టి భాగస్వామ్యంతో ప్రభుత్వం విశేష కృషిచేస్తోంది

- రాష్ట్ర వ్యాప్తంగా 284 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం, కందిపప్పు విక్రయం
- త్వరలో చక్కెర, చిరు ధాన్యాలు వంటివి కూడా అందించేందుకు చర్యలు
- పకడ్బందీగా ప్రజా పంపిణీ వ్యవస్థ అమలుకు సమష్టి కృషి
- బియ్యం పక్కదారి పట్టడంపై ముమ్మర దర్యాప్తు
- రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

రాష్ట్రంలో సామాన్యులకు సరసమైన ధరల్లో నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషిచేస్తోందని.. ఇందులో భాగంగా బియ్యం, కందిపప్పును అందించేందుకు రైతుబజార్లలో 284 ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించినట్లు రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.గురువారం విజయవాడ, ఏపీఐఐసీ కాలనీ రైతు బజార్లో మంత్రి నాదెండ్ల మనోహర్.. స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల శాఖ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, డైరెక్టర్ వీరపాండ్యన్, మార్కెటింగ్ శాఖ కమిషనర్ జి.శేఖర్‌బాబు, జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ తదితరులతో కలిసి బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు.కిలో కందిపప్పు రూ. 160, కిలో బియ్యం (స్టీమ్డ్ బీపీటీ) రూ. 49, కిలో బియ్యం (బీపీటీ రా రైస్) రూ. 48కే అందించే ఈ కౌంటర్ ద్వారా వినియోగదారులకు సరుకులను అందించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వివిధ సంక్షేమ పథకాలతో పాటు నిత్యావసర సరుకులను సరసమైన ధరల్లో సామాన్యులకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు, రైస్ మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు తదితరుల సమష్టి భాగస్వామ్యంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ధరల పెరుగుదల సమస్యను తమ కుటుంబ సమస్యగా భావించి, పరిష్కరించాల్సిన బాధ్యత వీరందరిపైనా ఉందన్నారు. నిత్యావసర సరుకుల ధరల స్థిరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బయట కిలో కందిపప్పు రూ. 181 ఉండటం వల్ల సామాన్యులు ఇబ్బందిపడుతున్నారని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రమంతా ఒకే ధర అమలుకావాలనే ఉద్దేశంతో నిర్ణయం తీసుకోవడం జరిగిందని.. హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్లు వంటి వాటిలో కూడా రూ. 160కే కిలో కందిపప్పును అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా చక్కెర, చిరుధాన్యాలు వంటివి కూడా అందించేందుకు కృషిచేస్తున్నామని.. వినియోగదారులు ఈ ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. రైతులతో పాటు వినియోగదారులకు కూడా లాభం చేకూరేలా పటిష్ట కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వం రైతులకు రూ. 1,600 కోట్లు బకాయిపెట్టి వెళ్లిందని.. రైతుల సంక్షేమాన్ని, క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గౌరవ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ. 1000 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ. 600 కోట్లను త్వరలోనే అందించనున్నట్లు వెల్లడించారు.

ఎక్కడా ఎలాంటి అవినీతి జరక్కుండా పీడీఎస్ అమలు:రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను ఎక్కడా ఎలాంటి అవినీతి లేకుండా లోటుపాట్లకు తావులేకుండా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పేదలకు చెందాల్సిన బియ్యం పక్కదారిపడితే చర్యలు తప్పవన్నారు. ఒక్క కాకినాడలోనే 43,249 మెట్రిక్ టన్నుల మేర బియ్యాన్ని సీజ్ చేయడం జరిగిందని.. సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సామాన్యులకు అందాల్సిన సరుకులు వారికి సరైన విధంగా అందాల్సిందేనని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు.కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో బీహెచ్ భవానీ శంకర్, పౌర సరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, డీఎస్‌వో జి.మోహన్‌బాబు, లీగల్ మెట్రాలజీ అధికారి ఎ.కృష్ణచైతన్య, అగ్రీ ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కె.మంగమ్మ, రాష్ట్ర రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ (గొల్లపూడి) ప్రెసిడెంట్ పరుచూరి నాగేశ్వరరావు, ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ స్టేట్ ప్రెసిడెంట్ భాస్కరరావు, జిల్లా ప్రెసిడెంట్ రవి, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కరుణాకర్, రైతులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం

వైద్యారోగ్యశాఖ హెచ్చరికలు బేఖాతరు

శ్రీకాకుళం,జూలై11 : యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, కరోనా నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబదిత, కీటక సంబందిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

## కొడుకు చేతిలో తల్లి దారుణ హత్య

కన్నతల్లిని రోకలి కర్రతోచంపిన కసాయి కొడుకు......



శ్రీ ప్రస్థానం : పాణ్యం నియోజకవర్గ పరిధిలోని వడ్డుగండ్ల గ్రామంలో కన్న కొడుకే కాలయముడై మతిస్మితం లేక కన్నతల్లిని రోకలి కర్రతో చంపిన వైనం చోటు చేసుకుంది, వివరాల్లోకి వెళ్తే నిందితుడు అంగ జాలం మహేష్ 36 సంవత్సరాలు గత కొంతకాలంగా మతి స్మితం లేక తాగుడుకు బానిసై కన్నతల్లి అయినా అంగజాల నాగలక్ష్మి 58 సంవత్సరాలు రోకలితో తలపై పడడంతో తీవ్ర రక్తస్రావ మై అక్కడికక్కడే మృతి చెందింది, విషయం తెలుసుకున్న పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్సై అశోక్, సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సాగు భూమి కలిగిన రైతులందరికి పి.ఎం. కిసాన్..

మండల వ్యవసాయధికారి కే. కె. సునీత.



.దొర్ని పాడు,జూలై:11, శ్రీ ప్రస్థానం:- వ్యవసాయ వినియోగానికిమాత్రమే అవసరమయ్యే సాగు భూమిని కలిగిన ఏ రైతుకు అయినాపి.ఎం.కిసాన్,ప్రయోజనాన్ని పొందేందుకు అర్హులవుతారని మండలవ్యవసాయధికారిని కె. సునీత,గురువారం ఓ ప్రకటనలో వెల్లడించించారు..ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మరణానంతరం కారణంగాభూమి వారసత్వం విషయంలో తప్పా..01-02-2019 తరువాతవ్యవసాయ భూమి కల్గి ఉన్న ఏ రైతైనా సరే వ్యవసాయ భూమిని అమ్మడం కానీ, విబజించడం కానీ.. బహుమతిగా ఇతరులకు బదిలీచేసిన యెడల బదిలీ దారుడుకి పి.ఎం.కిసాన్ పథకం వర్తించదని ఆమెఅన్నారు.. ఒక వేళ బదిలీ దారుడు తన పేరు మీద ఉన్న భూమినిఇతరులకు బదిలీ చేయడంతో బదిలీ దారుడు వద్ద ఎటువంటి వ్యవసాయభూమి లేక పోయినను పి.ఎం.కిసాన్,కు అనర్హులేనని ఆమెఅన్నారు..ఇప్పటికే పి.ఎం. కిసాన్ ప్రయో జనాన్ని పొందుతున్న కుటుంబసభ్యుడు ఉన్నట్లయితే.. అదే కుటుంబం లోని మరొక సభ్యుడికి అర్హతకలిగిన కూడా అనర్హులు అవుతారన్నారు..వ్యవసాయ భూమినివిక్రయించడం వల్ల... భూమి లేని రైతు కూడా అనర్హులవుతారన్నారు...పి.ఎం.కిసాన్ అర్హత,అనర్హత నిబంధనల పై రైతులకు అర్థం అయ్యేలావివరించాలని ఏ.ఓ.ఆయా గ్రామ వ్యవసాయ సహాకులకుసూచించారు...ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది,తదితరులుపాల్గొన్నారు...

## కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోండి...

ఏవో పవన్ కుమార్

తుగ్గలి,మండల పరిధిలోని గల కౌలు రైతులందరూ కౌలు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలియజేశారు. గురువారం రోజున మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయం నందు తహసిల్దార్ షర్మిల అధ్యక్షతన కౌలు రైతు కార్డ్ పై గ్రామ రెవెన్యూ అధికారులకు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కౌలు చేస్తున్న ప్రతి రైతు కౌలు కార్డు ను గ్రామ రెవెన్యూ అధికారి దగ్గర తీసుకోవాలని ఏవో తెలియజేశారు. కౌలు కార్డు ఉన్న కౌలు రైతుకు అన్ని రకాల ప్రభుత్వ పథకాలైన అన్నదాత సుఖీభవ,పంట బీమా,పెట్టుబడి సహాయం,పంట కొనుగోలు,బ్యాంకు రుణము వంటి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఏవో తెలియజేశారు. గురువారం నుండి ప్రతి సచివాలయం నందు కౌలు రైతు కార్డు అవగాహన సదస్సులు జరుగుతాయని ఏవో వీఆర్వోలకు తెలియజేశారు.ఈ అవకాశాన్ని కౌలు రైతులందరూ వినియోగించుకోవాలని ఏఓ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తుగ్గలి డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు,ఆర్ఐ సుధాకర్ రెడ్డి,మండల విఆర్వోలు, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757